"కానీ కార్మికులకు యాజమాన్యానికి ఏమైనా "మిస్ అండర్‌స్టాండింగ్స్" వచ్చినపుడు జపాను వంటి దేశల్లో సమ్మెలు చేయరు. "బ్లాక్ బేడ్జి" డిమాన్‌స్ట్రేషన్‌తోనే సమస్యల్ని పరిష్కారం చేసుకుంటారు. మనదేశంలో కూడా అలాంటి మార్పు రాగలిగితే పారిశ్రామిక ప్రగతి కుంటుబడే అవకాశం లేదుగా ?"

యోగేంద్ర ప్రశ్నకు కొన్నిక్షణాలు మౌనంగా వుండిపోయాడు కిరీటి .

"నిజమే... సాధ్యమైనంతవరకు అక్కడి కార్మికులు సమ్మె చేయకుండా బ్లాక్ బేడ్జి డిమాన్‌స్ట్రేషన్‌తో సరిపెడతారు. అంతేకాదు సమస్య పరిష్కారమయ్యేంతవరకు విపరీతంగా ఉత్పత్తిని పెంచేస్తారు. ఆ విధంగా "ప్రొడక్టు" తాలూకు విలువ మార్కెట్టులో పడిపోయేట్టుగా చేసి తమ హక్కుల్ని సాధించుకుంటారు. దీనికి ముఖ్యమైన కారణం కనీస అవసరాలకు ఏ లోటు లేని అక్కడి ప్రజల్లోగాని, కార్మికుల్లోగాని నైతికమైన బాధ్యతను విస్మరించరాదన్న ఆలోచన.... కాబట్టే హక్కుల్ని, కర్తవ్యాన్ని కూడా సమానంగా స్వీకరిస్తారు... రెండవ ప్రపంచ యుద్ధంలో దారుణమైన పరిస్థితులకు దిగజారిపోయిన జపాన్ యీనాడు ప్రపంచ పారిశ్రామిక రంగంలో ఇంతటి ఉచ్ఛదిశకు చేరుకుందంటే కారణం అదే అంటే అతిశయోక్తి కాదు.

అదే మన కార్మిక వర్గం విషయానికి వస్తే.... ఇక్కడ సగటున వ్యక్తి రాబడి తక్కువ. కాబట్టి ఆర్థికమైన ఇబ్బందులు ఎప్పుడూ ఉంటాయి. ఇది అదనుగా చేసుకుని కొందరు రాజకీయ వ్యక్తులో, సంఘ విద్రోహ శక్తులో తమకో ఆస్థిత్వాన్ని ఏర్పరచుకోవాలని కార్మికుల్ని రెచ్చగొడతారు. చిరు సమస్యల్ని భూతద్దాల్లో చూపించి భయపెట్టి పరిశ్రామిక అశాంతిని సృష్టించి పబ్బంగ డుపుతారు. అయితే హక్కులతో పాటు విధుల్ని ఆచరించటం కార్మికులకి అవసరమనిగాని, దేశం ఆర్థికంగా పురోగమించాలంటే కార్మికుల్లో క్రమశిక్షణ నిజాయితీ ముఖ్యమని గాని నూరిపోయటం వాళ్ళకు చేతకాదు. ఆ విధంగా కార్మాగారాల్లో ఉత్పత్తి, వ్యక్తుల్లో మానసిక వికాసం కుంటుబడి మొత్తం సామాజిక పురోగమనమే స్తంభించిపోయే ప్రమాదం వాటిల్లుతోంది. ఇటువంటి కాలుష్య వాతావరణం నుండి దేశాన్ని రక్షించాలంటే ప్రజల్లో మార్పు రావాలా ప్రభుత్వ యంత్రాంగాలు కళ్ళు తెరవాలా లేక మరో రాముడు, గాంధీ లాంటి వ్యక్తులు మళ్ళీ ఉద్భవించాలా అన్నది ఏ ఒక్కరో నిర్ణయించలేనిదీ ఇదమిత్తంగా చెప్పలేనిదీను..." నిట్టూరుస్తూ ఆగిపోయాడు కిరీటి .

మృదుగంభీరంగా కనిపించే కిరీటి మనసు ఇంత లోతైనదా అనుకున్నాడు యోగేంద్ర.

శిల్ప మాటలతోపాటు, గతరాత్రి డైనింగ్ హాల్లో కిరీటి సమక్షంలో శిల్ప వహించిన మౌనం గుర్తుకొచ్చి బాధ పడ్డాడు.

కిరీటిని అర్థం చేసుకోవటంలో శిల్ప తప్పకుండా పొరపాటు పడిందీ అన్న నిర్ణయానికి వచ్చేశాడు.

అయితే తన పాత్ర ఎంత వరకూ ఉండాలి, వారి మధ్య సరైన అవగాహన ఏర్పడటానికి తానేమైనా కృషి చేయాలా అన్నది నిర్ధారణ చేసుకోలేకపోయాడు.

మరుసటిరోజు భీమునిపట్నం అత్తమామల దగ్గరకు వెళ్ళిన యోగేంద్ర భార్య స్మృతులు మనసుని కలిపివేస్తుంటే ఎక్కువ రోజులు వుండలేక మూడవ రోజుకల్లా మళ్ళీ వైజాక్ తిరిగి వచ్చేశాడు.

ఒంటరిగా బీచ్‌లో కొంతసేపు ప్రశాంతంగా కూర్చుందామన్నా ప్రయోజనం లేకపోయేసరికి మాలినీ నిలయానికి వెళ్ళాడు.

అపరాహ్ణవేళ కావటంతో కిరీటి లేడు.

హాలులో కూర్చుని శిల్పతో మాట్లాడుతుండగా కిరీటి ఇచ్చిన డబ్బుతో రాయవెల్లూరు వెళ్ళిన డ్రైవరు థామస్ ఆపరేషను జయప్రదంగా ముగించుకుని కొడుకుతో సహా తిరిగి వచ్చాడు.

కొడుకును కాపాడు కోలేమోనన్న భయంతో తానెంత మధన పడిందీ చివరకు కిరీటి శిల్పల ఔదార్యంతో తన కొడుకునెలా రక్షించుకున్నదీ థామస్ వివరిస్తుంటే నిశ్చేష్టుడై అంతా విన్నాడు యోగేంద్ర.

ప్రక్కనే నిలబడ్డ పన్నెండేళ్ళ బాలుడి షర్టుపై కత్తి ఆపరేషను ఎక్కడ చేసిందీ చూపించాడు.

ఆనందభాష్పాలు రాలుస్తూ, “అమ్మగారూ! ఇదంతా మీ దయేనండీ.... ఏసు ప్రభువు నా మొరాలకించి మీద్వారా నాకష్టాలన్ని గట్టెక్కించాడండీ ”అంటూ పాదాలను తాకినంత పనిచేశాడు.

థామస్ వెళ్ళిపోయిన తర్వాత చాలాసేపటికి యోగేంద్ర తేరుకోలేదు.

అతని ఊహల్లో ఉత్తుంగ హిమాలయంలా ఎదిగిపోయిన కిరీటి.... మానవతకు మరో రూపమైన మహా మనిషి...

ఇంతటి ప్రేమ సముద్రుడైన కిరీటిని శిల్ప ఎందుకు ప్రేమించలేక పోతుంది.

ప్రపుల్లవదనంతో పౌర్ణమి చంద్రునిలా భాసిల్లే అతని నీడన సేద దీర్చుకోక శిల్ప యెందుకు సంఘర్షణకు లోనవుతుంది.

పెరిగిన వాతావరణమా....?

ప్రేమకు నిర్వచనం తెలీని అమాయకత్వమా....?

“ఏంటి బావా , అంతలా ఆలోచిస్తున్నావు?”

“నీ గురించే...” నిశ్చలంగా అన్నాడు. ఆశ్చర్యంగా అతని వేపు చూసింది.

“అవును శిల్పా! ఇంతమందికి పూజ్యనీయుడైన కిరీటి నీ ప్రేమకు ఎందుకు నోచుకోలేక పోతున్నాడా అని”

“సరి. నీకూ వంట పట్టేసిందన్నమాట.” దీర్ఘంతీసింది...

“నీకు తెలీదు బావా ఆయన సంగతి మాటల్తో మనుషుల్ని భలేగా బోల్తా కొట్టిస్తారాయన”

శిల్ప అమాయకత్వానికి నవ్వొచ్చింది.

"శిల్పా! ఆయనే తలచుకుంటే నాలాంటి వాళ్ళ కెందరికైనా డబ్బు పారేసి ఉద్యోగాలివ్వగల సమర్థుడు. నన్ను బోల్తా కొట్టించాల్సిన అగత్యమేమిటి?"

"ఏముంది..నువ్వు నాకెక్కడ వత్తాసు పలుకుతావోనని."

"తన సమస్య పరిష్కరించుకోడానికి మరోసారి సహాయాన్ని అర్థించే అసమర్థుడు కాడు కిరీటి "

"హు! ఆఖరుకి నువ్వుకూడా నాకే నీతులు చెబుతున్నావన్నమాట" అక్కసుగా అంది.

"లేదు శిల్పా! నీ అహంకారంతో కిరీటికి దూరం కావద్దంటున్నాను. అనాలోచితంగా ప్రవర్తించి చేజేతులా కాపురాన్ని కూలదోసుకోవద్దంటున్నాను" చనువు కొద్దీ హెచ్చరిస్తున్నట్టుగా అన్నాడు.

"చాలు.... నాకెవరూ నీతులు చెప్పనక్కర్లేదు." ఆమెకు దు:ఖం ముంచుకొచ్చింది.

"ఆయన ఎలా తిరిగినా న్యాయమే.... ఎన్ని గ్రంధాలు నడిపినా పర్వాలేదు... ఎందుకిలా చేస్తున్నారూ అని నేను నిలదీతయటం తప్పు. అంతేగా నువ్వు చెప్పేది." పొరలి వస్తున్న దు:ఖాన్ని ఆపుకుంటూ గదిలోకి వెళ్ళిపోయింది.

కన్య విషయం చెప్పాలని, వేళకు ఇంటికి రాకుండా అర్ధరాత్రి వరకూ ఆమెతో వెలగపెట్టే రాచకార్యాల గురించి ఏకరువు పెట్టాలనుకుంది.

తనకు బాగా చేరికైన నానీని తనకు దూరం చేసిందీ ఆ విధంగా తననెలా సాధిస్తున్నదీ వివరించాలనుకుంది.

కాని యోగేంద్ర కూడా తనకే బుద్ధి చెప్పటం మొదలు పెట్టేసరికి మౌనంగా ఉండిపోయింది.

కోపం చల్లబడ్డాక బయటకు వచ్చింది, యోగేంద్రకు మొత్తం చెప్పేద్దామని....

కాని అప్పటికే అతడు వెళ్ళిపోవటంతో టెర్రస్‌పైకి వెళ్ళి పచార్లు చేయసాగింది.

నల్లని రాళ్ళను గుద్దుకుంటూ విరిగిపోతున్న కెరటాల్నీ తెల్లని ఇసుక తిన్నెల్నీ చూస్తుంటే నానీ గుర్తుకొచ్చాడు.

తరచూ నానీతో బీచ్‌కి వెళ్ళి గడిపిన క్షణాలు, నానీ కేరింతలు జ్ఞప్తికి వచ్చాయి.

హు! ఆవిడగారి కొడుకనే తీసుకు వెళ్ళిపోయింది.

రేపు నాకూ కొడుకు పుడితే ....!

సిగ్గుతో ఆమె కనులు అరమోడ్పులయ్యాయి?

విశాలమైన ఆ భవంతి, అందంగా పరుచుకున్న పూతోట, ఫౌంటేన్ అన్నీ కొత్తగానూ మరింత అందంగానూ కనిపించాయి.

"ఏడాదిలోగా కవలపిల్లల్ని కనాలి." సునీత మాటలు గుర్తుకొచ్చాయి

చిన్నబాబుతో సరదాలు, కిరీటితో కారు ప్రయాణాలు....

బాబు బుడిబుడి నడకలు... కేరింతల ప్రతి ధ్వనులు...

కొన్ని క్షణాల వరకూ కలల్లో గడిపేసింది.

వాస్తవం గుర్తుకొచ్చేసరికి .....

వెగటు పుట్టించే ఒంటరితనం ...నీరసం...

ఏమిటి నిర్జీవ ప్రయాణం...

పిచ్చెక్కేస్తుంది.....

"అమ్మగారూ ఫోన్" నౌకరు చెప్పటంతో క్రిందికి వెళ్ళింది.

"హల్లో..."

"బాగున్నావా ఆంటీ" నానీ కంఠం వినిపించగానే తన్మయురలై పోయింది.

"బాగున్నాను నానీ... మరినువ్వో"

"ఇప్పుడే స్కూల్ నుండి తిరిగొచ్చా...."

"ఏమిటి నువ్వప్పుడే స్కూల్లో చేరిపోయావా"

"సెంట్ జోసెఫ్ కాన్వెంట్‌లో చేరానుగా"

"వెరీ గుడ్.... మరి నాదగ్గరికి రావటమే మానేశావేం నానీ"

"పెద్ద ఆంటీవి.... నువ్వు రావాలిగాని, చిన్నపిల్లాడిని నేనెలా వస్తాను..."

"నిజమే నానీ..... మరి మీ మమ్మీ నన్ను రానిస్తుందా"

"రానివ్వకపోతే నీకు ఫోన్ చేయమని ఎందుకు చెబుతుంది ఆంటీ" శిల్ప వెంటనే మాట్లాడలేకపోయింది.

"మీ మమ్మీ నీ దగ్గరే నిలడిందా"

"ఊహు! అంకుల్‌తో గదిలో కూర్చుని మాట్లాడుతుంది."

"..............."

"మాట్లాడు ఆంటీ."

"ఆ, అదే... చూడు నానీ... రేపు ఉదయం నువ్వెన్ని గంటలకి స్కూల్‌కు వెళతావు"

"సరిగ్గా ఎనిమిది గంటలకి"

"ఎవరు తీసుకెళ్తారు."

"కారులో నేనే ఒంటరిగా వెళ్తా "

"ఉంటా నాన్నా" ఫోన్ పెట్టేసింది.

నానీతో ఇంకా మాట్లాడాలనుంది.

కాని కిరీటి కూడా అక్కడే వున్నాడని కన్యతో మాట్లాడుతూ గదిలో కూర్చున్నాడని తెలిసేసరికి ఆమెలో నిబ్బరం సడలిపోయింది.

మెదడు పగిలేట్టు.... నరాలు చిట్లేట్టు ఉక్రోషం ....

తనేలా పోతేనేం ....

వాళ్ళు మాత్రం హాయిగానే వుంటారు....

ఎదురుగా తను లేదు కాబట్టి ఇంకా బోలెడంత స్వేచ్ఛ...

రాత్రి డిన్నర్ పూర్తిచేసి తన గదిలోకి వెళ్తున్న శిల్ప అప్పుడే వచ్చి డ్రెస్ చేంజ్ చేసుకుంటున్న కిరీటిని చూడలేదు.

"యోగేంద్ర వచ్చాడా"

కిరీటి కంఠం వినగానే ఉగ్రురాలైపోయింది శిల్ప నిర్లక్ష్యంగా గదిలోకి వెళ్ళిపోవాలనుకుంది. కాని వెళితే కిరీటిని ఎగతాళి చేసే అవకాశం ఉండదు కాబట్టి, ఆగి, అతన్ని ఆపాదమస్తకం చూసింది ఓ మారు....

"అదేమిటి పాపం... మీ దగ్గరకి అస్సలు రానేలేదా !" వ్యంగ్యంగా అడిగింది.

"ఉహు! ఆవేళ ఫేక్టరీకి వచ్చాడు. మళ్ళీ కనిపించలేదు....."

"ఎలా కనిపిస్తాడు... మీరేమో ఫేక్టరీలో కంటే ఆవిడ యింటిలోనే కాలక్షేపం చేస్తున్నారాయె. పాపం ఆవిడగారి ఎడ్రసు ఆయనకు తెలీదేమో. ఆ ఇల్లు కూడా చూపించాల్సింది."

అనాలనుకున్న నాలుగు మాటలు అనేసి ప్రక్కకు చూసేసరికి కిరీటి అక్కడ లేడు.

అవమానంతో తల విదిలించుకుంది.

18

నానీ స్కూల్నుండి ఇంటికి తిరిగిరాలేదని కన్య ఆందోళనగా ఫోన్ చేయగానే, హడావిడిగా కన్య ఉంటున్న బంగళాకి వెళ్ళాడు కిరీటి .

నానీ కోసం ఎదురుచూసి డ్రైవరు తిరిగొచ్చేసాడని, ఎంక్వైరీ చేద్దామని వెళితే అక్కడ ఘూర్ఖా తప్ప మరెవరూ లేరని చెప్పి, కన్య కళ్ళ నీళ్ళు పెట్టుకుంటుంటే ఓదార్చటం కిరీటికి సాధ్యం కాలేదు.

యస్.పి.కి ఫోన్ చేసి కావలసిన సహాయం కోసం అర్థించాడు.

కన్యతో సహా కారులో బయలుదేరి చాలా ప్రదేశాలలో గాలించిన కిరీటి రాత్రి పదిగంటల వేళ ఆమెను ఇంటి దగ్గర డ్రాప్చేశాడు.

కన్యలోని నిస్తబ్దతను చూసి మాలినీ నిలయానికి తిరిగి వెళ్ళటానికి ధైర్యం చాలలేదు. కాని కన్య బలవంతం చేయటంతో తిరిగి తనే సాంత్వన వచనాలు చెప్పే సరికి రాత్రి పదకొండు గంటలకు బంగళాకి వచ్చాడు.

భోజనం చేయాలనిపించలేదు.

ఓ అర్థగంటసేపు అలాగే కూర్చున్న కిరీటి ఏదో గుర్తుకొచ్చినట్టుగా లేచి శిల్ప గదిలోకి వెళ్ళాడు.

నానీ శిల్పను కావలించుకుని నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

కన్య ఫోన్ చేస్తే తనకేమీ తెలియదని శిల్ప ఎందుకు చెప్పినట్టు.....?

కోపోద్రిక్తుడైన కిరీటి "శిల్పా!" అంటూ కేక వేసేసరికి ఉలిక్కిపడి నిద్రలేచింది శిల్ప.

అతడి ముఖంలోని భావాన్ని చదివేయగలిగిన శిల్ప తప్పుచేసినట్టుగా బిక్కముఖం వేసుకు నిలబడింది.

"ఎందుకిలా చేశావు.... అందర్నీ ఎందుకిలా ఇబ్బంది పెట్టావు... దీనివలన నువ్వు సాధించినదేమిటి...? ఏం కోరి నువ్విలా ప్రవర్తిస్తున్నావు.... నామీద కక్ష తీర్చుకుంటున్నావు చాలదా...